క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జీతాలను సక్రమంగా ఇవ్వక పోగా, బ్యాంకు ఈఎంఐల చెల్లింపులు ఇబ్బందిగా మారిందన్నారు. ప్రస్తుతం ఏర్పడిన ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీన జీతాలను ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గీట్ల సుమీత్, కార్యదర్శి గోవర్ధన్, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కవిత పాల్గొన్నారు.

మోడీ పర్యటన విజయవంతం చేయండి

రామకృష్ణాపూర్: బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా ప్రధాని నరేంద్రమోడీ సోమవారం ఆదిలాబాద్‌కు విచ్చేస్తున్నారని మోడీ పర్యటనను విజ యవంతం చేయాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్ కోరారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని మోడీ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిరూరల్: పట్టణంలోని వాడవాడలా కూడళ్ల వద్ద తప్పకుడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని రామన్‌కాలనీ సమీపంలోని రాజన్నల వాడలో గల మేకల మండి వద్ద రాజన్నల సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆరు సీసీ కెమెరాలను ఎస్సై రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలు నియంత్రించవచ్చని తెలిపారు. నేరాలు జరిగితే సీసీ కెమెరాల ద్వారా చేధించడానికి వీలుంటుందని వివరించారు. ఆయన వెంట రాజన్నల సహకార సంఘం నాయకులు ఉన్నారు.

కార్యవర్గం ఎన్నిక



బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి లైన్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. స్థానికంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో లైన్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.డి.ఎజాస్, ఉపాధ్యక్షుడిగా టి.ఉదయ్ సింగ్, కార్యదర్శిగా ఎస్.పద్మారావు, సంయుక్త కార్యదర్శిగా ఎం.డి అఫ్జల్ బాబా, ట్రెజరర్‌గా బి.శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఎన్నికైన కార్యవర్గం మాట్లాడుతూ.. ఓనర్స్ సమస్యల ను పరిష్కరించడంలో నిత్యం అందుబా టులో ఉంటామన్నారు. ప్రభుత్వం లారీ ఓనర్స్ సమస్యలను పరిష్కరించాలన్నారు.

మహిళలకు అవగాహన



శిక్షణ ఇస్తున్న డీపీఎం, ఏపీఎంలు

నెన్నెల: గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలను లక్షాధికారులుగా చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'లఖ్‌పతి దీదీ' పథకాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) సంజీవ్, నెన్నెల, భీమిని ఏపీఎంలు ప్రకాష్‌గౌడ్, విజయలక్ష్మీ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో వీఓఏ, సీసీలకు ఆదివారం ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కావాల్సిన వనరులు, శిక్షణలు, మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంలో వీఓఏలు పూర్తిగా బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో సీబీఓ ఆడిటర్ ఆంజనేయులు, సీసీలు శ్రీనివాస్, కమలాకర్, గంగరాజు, సువర్ణ పాల్గొన్నారు.

ఊరూరా పల్స్‌పోలియో

- చుక్కల మందుకు చక్కని స్పందన
- ప్రారంభించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 0 నుంచి ఐదు సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులకు చుక్కలు వేయించడం ద్వారా పోలియో మహమ్మారిని సంపూర్ణంగా నివారించవచ్చని వైద్యులు సూచించారు. రెండు చుక్కలు చిన్నారుల నిండు జీవితానికి దోహదపడతాయని పేర్కొన్నారు. పోలియో చుక్కలు వేయించడంలో నిర్లక్ష్యం చేయొద్దని హితవు పలికారు.



మందమర్రిరూరల్: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

జన్నారం: మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జెడ్పీటీసీ చంద్రశేఖర్ ప్రారంభించారు. మండలంలో 90శాతం పూర్తయినట్లు, మరో పది శాతం ఇంటింటికీ వెళ్లి వేయనున్నట్లు వైద్యాధికారి ఉమశ్రీ తెలిపారు. 3300మంది పిల్లలకు వేయాల్సి ఉండగా, 2900మందికి వేసినట్లు తెలిపారు.

లక్సెట్టిపేట: మండలంలో 34పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి 4250మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ నెల 4, 5వ తేదీల్లో ప్రతి ఇంటికీ తిరుగుతూ పోలియో చుక్కలు వేస్తామని అధికారులు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య, వైద్యాధికారులు సతీష్ ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దండేపల్లి: దండేపల్లిలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగరాణి, ఎంపీటీసీ శ్రీనివాస్ ప్రారంభించారు. దండేపల్లి, తాళ్లపేట పీహెచ్‌సీల వైద్యులు సతీష్, క్రాంతికుమార్, వైద్య సిబ్బంది అంగన్‌వాడీటీచర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నూర్: మున్సిపాలిటీలో పల్స్ పోలియోను మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా ప్రారంభించారు. పుట్టినప్పటి నుంచి ఐదేళ్ల పిల్లల వరకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆర్పీలు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రిలో పాత బస్టాండ్ ఏరియాలోని జయశంకర్ కూడలి వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరై చిన్నారికి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యుత్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వినియోగదారులకు జీరో బిల్లు రశీదు పంపిణీ చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ప్రభుత్వ వైద్యాధికారి రమేష్, విద్యుత్‌శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కోటపల్లి: పోలియో మహమ్మారి నివారణకు చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం గ్రామాల్లో విజయవంతంగా జరిగింది. పల్స్‌పోలియో కార్యక్రమంలో 2837మంది చిన్నారులకు పంపిణీ చేయగా 94శాతంకు చేరింది. డాక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది పబ్బాసుధాకర్ ప్రాణహిత నది తీర ప్రాంతాల్లో వలసవచ్చిన చిన్నారులకు పోలియో చుక్కలు అందించారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని పీహెచ్‌సీలో చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని చైర్మన్ సురిమిల్ల వేణు, కమిషనర్ సీహెచ్ సతీష్, మెడికల్ ఆఫీసర్ సమత ప్రారంభించారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ), దొనబండ సబ్ సెంటర్‌ల ఆధ్వర్యంలో పోలియో చుక్కల కార్యక్రమం కొనసాగింది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లహరి పర్యవేక్షణలో 0నుంచి 5సంవత్సరాలలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. రాపల్లి గ్రామ పంచాయతీలో ఎంపీపీ స్వర్ణలత కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో 17పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి 1,861మంది చిన్నారులు ఉండగా మొదటి రోజు 1,849మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యులు అర్చన తెలిపారు. 99శాతం లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో పోలియో చుక్కల కార్యక్రమంలో భాగంగా కమాండెంట్ జమీల్ భాష ఆధ్వర్యంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ చౌహాన్, బెటాలియన్ సిబ్బంది, వైద్యుల్ శ్రీధర్, సంతోశ్ పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా తాళ్లగురిజాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీపీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు చుక్కల మందు వేసి ప్రారంభించారు. మండల పరిధిలో 2076మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 1948మందికి వేయగా 94శాతం నమోదైంది. తాళ్లగురిజాల పీహెచ్‌సీ వైద్యురాలు తమ్మడి ఎవాంజెలిన్, సీహెచ్‌వో ప్రభాకర్, హెచ్‌ఈవో సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: కాంటా చౌరస్తాలో, రైల్వే స్టేషన్ ఏరియా ప్రాంతంలో సీహెచ్‌సీ డాక్టర్లు సుచరిత, సౌజన్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత పల్స్‌పోలియో ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ప్రభాకర్, సురేష్, కమ్యూనిటీ హెల్త్ అధికారి రవీందర్, డీపీఎంయూ రమేష్, పబ్లిక్ హెల్త్ మేనేజర్ మధు, పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు పలు అంగన్ వాడీ కేంద్రాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కుమారస్వామి, ఎంపీటీసీలు సూరం రవీందర్ రెడ్డి, సిరంగి శంకర్ ప్రారంభించారు. మండల వ్యాప్తంగా తొలిరోజు 94శాతం పోలియో చుక్కల పంపిణీ పూర్తి చేసినట్లు సోమ, మంగళవారాల్లో 100శాతం పూర్తి చేస్తామని తెలిపారు.కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈసా, మాజీ సర్పంచ్ కాపర్తి సుభాష్ పాల్గొన్నారు.

కాసిపేట: ప్రభుత్వం చేపట్టిన పల్స్‌పోలియో కార్యక్రమం మండలంలో ఆదివారం వైద్యాధికారి రవికిరణ్ ఆధ్వర్యంలో ప్రారంభించగా 98శాతం నమోదు అయింది. మండలంలో 3201మంది చిన్నారులు ఉండగా 3137మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇంటింటికీ తిరిగి 100శాతం పూర్తి చేయనున్నట్లు తెలిపారు.



చెన్నూర్ మున్సిపల్ కార్యాలయంలో పల్స్ పోలియోను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్



నస్పూర్: ప్రారంభిస్తున్న చైర్మన్ వేణు



బెల్లంపల్లిరూరల్: కాంటా చౌరస్తాలో...



లక్సెట్టిపేట: చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ సత్తయ్య

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సరోజన

భీమారం: మాజీ కేంద్రమంత్రి కాంగ్రెస్ నాయకులు గడ్డం వెంకటస్వామి స్మారకార్థం ఆదివాసీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆదివారం ఎంపీటీసీ చేకుర్తి సరోజన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సాధనతో పాటు యువత క్రికెట్ రంగంలో రాణించేందుకు కాకా కుటుంబం అనేక ప్రయత్నాలు చేస్తుందని పేర్కొన్నారు. పేదలకు ఉపయోగపడే గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తుందని దీనిద్వారా పేదలకు విద్యుత్ బిల్లుల భారం తగ్గిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు చేకుర్తి సత్యనారాయణ రెడ్డి, ఆదివాసీ యువజనసంఘం నాయకులు తైనేని రవి, సుధాకర్, గణేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీకి చేసిన సేవలు అభినందనీయం



గోపి సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న ఆర్‌ఎం

జన్నారం:కండక్టర్‌గా, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా గోపి సత్యనారాయణ ఆర్టీసీకి చేసిన సేవలు అభినందనీయమని ఆదిలాబాద్ ఆర్‌ఎం పగిడిమర్రి సోలోమన్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన సత్యనారాయణకు జన్నారంలోని ఆర్‌ఆర్‌ఎస్ హాల్‌లో ఆదివారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ ప్రయాణికులను సుదూర ప్రాంతాలకు సురక్షితంగా చేర్చడంలో ఆర్టీసీ అధికారుల పాత్ర గొప్పదన్నారు. ఇంట్లో ఏ సమస్య ఉన్న విధుల్లో స్వేచ్ఛగా పనిచేస్తూ, ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా సహనం, ఓర్పుతో విధులు నిర్వహిస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నారన్నారు. అనంతరం సత్యనారాయణ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీటీసీ కొంతం శంకరయ్య, మున్నూరుకాపు సంఘం నాయకుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'రాజేశ్వరస్వామి పద, పద్యనీరాజనం' ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న కవులు,రచయితలు

మంచిర్యాలఅర్బన్: దేశభక్తుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, పుస్తకా సంపాదకుడు సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన వేములవాడ రాజరాజేశ్వరస్వామి పద, పద్య నీరాజనం పుస్తకావిష్కరణ ఆదివారం మంచిర్యాలలో జరిగింది. ముఖ్యఅతిథిగా కొరిడే విశ్వనాథశర్మ, సంస్కృత పండితుడు లక్ష్మీనరిసింహ సంస్కృతాంధ్ర కళాశాల ధర్మపురి పుస్తక సమీక్ష చే శారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు సురేష్, కవులు అల్లాడి శ్రీనివాస్, శీలం శ్రీనివాస్‌రెడ్డి, వామన్‌రావు, తుమ్మల మ ల్లారెడ్డి, గోపగాని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీటీసీ శంకర్, నాయకులు

తాండూర్: తాండూర్‌లోని షాదీఖానా నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీటీసీ సిరంగి శంకర్ అన్నారు. స్థానిక నాయకులతో కలిసి ఆదివారం అసంపూర్తిగా ఉన్న షాదీఖానా పునురుద్ధరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా షాదీఖానా నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఇప్పటికైనా పనులు త్వరగా పూర్తిచేసి షాదీఖానాను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కాంట్రాక్టర్ రాజేశంకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈసా తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ.. పిల్లులు!

మనిషితో సాదుజంతువులు ఆవులు, మేకలు, గొర్రెలు, గేదెలు, కుక్కలు కలిసి జీవించడం అనాదిగా వస్తోంది. తాజాగా మారుతున్న లైఫ్‌స్టైల్‌తో సాదుజంతువుల జాబితాలో ఇప్పుడు పిల్లి కూడా చేరింది. చాలాకాలంగా మార్జాలం మనిషితో స్నేహం చేస్తున్నా అది పెద్ద నగరాలు, సంపన్నులకు మాత్రమే సాధ్యమైంది. కానీ ఇప్పుడు చిన్న పట్టణాలకు చెందిన మధ్యతరగతి ప్రజలు కూడా పిల్లుల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు పిల్లి ఎదురైతే అపశకునంగా భావించేవారు. ఇప్పుడ పరుపులు వేసి నట్టింట్లో పడుకోబెడుతున్నారు. అంతలా పిల్లులతో అనుబంధం పెంచుకుంటున్నారు. బెల్లంపల్లికి చెందిన ఇద్దరు హోంగార్డుల నివాస గృహాలు పిల్లుల పెంపకానికి నిలయాలుగా మారాయి. వాళ్ల మాదిరిగానే అనేకమంది ఇళ్లల్లోనూ మార్జాలాల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు.

- పెంపకానికి ఆసక్తి చూపుతున్న జిల్లా వాసులు
- అల్లారు ముద్దుగా చూసుకుంటున్న ఇద్దరు హోంగార్డులు



మంచంపై పడుకున్న హాజీతో ఆడుకుంటున్న పిల్లులు





బెల్లంపల్లి: బెల్లంపల్లి కాంట్రాక్టర్ బస్తీకి చెందిన మహ్మద్ హాజీ, కమిషనరేట్ ఆర్మూర్ రిజర్వుడ్ (ఏఆర్) హెడ్‌క్వార్టర్‌కి చెందిన సలీం అహ్మద్‌ఖాన్ హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ ఇద్దరు చిన్నతనం నుంచే జంతుప్రేమికులు. ఇళ్లలో దేశవాళీ మార్జాలాలను సాకడం అలవాటు చేసుకున్నారు. సలీం అహ్మద్‌ఖాన్‌కు హైదరాబాద్, మహారాష్ట్రలో బంధువులు ఉన్నారు. వేర్వేరు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న బంధువుల ఇళ్లకు వెళ్లిన క్రమంలో ఫారన్ బ్రీడ్ మార్జాలాలను చూశాడు. అవి సంతానోత్పత్తి చేయడంతో పసి కూనలను తీసుకువచ్చి పెంపకం చేపట్టాడు. కరీంనగర్‌లో స్నేహితుడి వద్ద హాజీ రూ.10 వేలు ధర చెల్లించి ఫారన్ బ్రీడ్ పిల్లిని తెచ్చి సాకాడు. హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ఆ ఇద్దరి మధ్య ఓసారి పిల్లుల ప్రస్తావన వచ్చింది. ఇద్దరి వద్ద ఉన్న ఆడ, మగ ఫారన్ బ్రీడ్ పిల్లులను క్రాస్ చేయించడంతో సంతానోత్పత్తి జరిగి క్రమంగా వృద్ధి చెందాయి.

పదుల సంఖ్యలో..

జంతు ప్రేమికులైన మహ్మద్ హాజీ, సలీం అహ్మద్ ఖాన్ ఇళ్లలో దశాబ్దకాలం పైబడి నుంచి పిల్లుల పెంపకం జరుగుతోంది. పదుల సంఖ్యలో పిల్లులు, పిల్లలు ఉండటంతో కొందరికి వాటిని అమ్ముకోగా అనేకమందికి ఉచితంగా సాకడానికి అందజేశారు. బెల్లంపల్లి వాసులే కాకుండా ఇతర ప్రాంతాలవారికి పిల్లికూనలు అప్పగించి పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు.

మార్జాలల రకాలు..రంగులు

ఫారన్ బ్రీడ్ పిల్లులు ప్రత్యేక ఆకర్షణను కలిగి ఉంటాయి. వీటిలో ప్రధానంగా పెర్షన్ క్యాట్, రష్యన్ బ్లూ, థరకిస్ అంగోరా, సియామ్స్, కార్నిష్‌రెక్స్, బాంబే, మ్యాన్‌కూంగ్, అభిషినియన్, బిర్మన్, ఓసీ తదితర క్యాట్‌లు ముఖ్యమైనవి. వీటి రంగులు చూడముచ్చటగా ఉంటాయి. నలుపు, తెలుపు, బూడిద, యాష్, మెరున్, బంగారు వర్ణాలతోపాటు మల్టీ కలర్, బ్లాక్ అండ్‌వైట్ రంగుల్లో ఉండి కనుల విందు కలిగిస్తాయి.

ప్రత్యేక ఆహారం

ఫారన్ బ్రీడ్ క్యాట్‌లకు ప్రత్యేక ఆహారం ఇవ్వాల్సి ఉంటుంది. నాలుగు నెలల వయసు ఉన్న పిల్లికూనలకు పాలలో కొద్దిగా సెరిలాక్ కలిపి రోజు 3 పూటలు ఆహారం ఇస్తే ఆరోగ్యంగా ఎదగడానికి వీలుంటుంది. ఐదు నెలల వయసు ఉన్న పిల్లులకు మియావ్ ఫుడ్ పెట్టాల్సి ఉంటుంది. మందుల షాపుల్లో వీటి ధర రూ.2,500 ఉంది. ప్రత్యేక ఆహారాన్ని గరిష్ఠంగా రెండు నెలలపాటు అందిస్తే సరిపోతుంది. ఈ పిల్లులు వేడిని తట్టుకోలేవు. కూలర్, ఏసీ సౌకర్యం అందుబాటులో ఉంచాలి. శునకాలతో ఇవి ఈజీగా కలిసిపోతాయి. శునకాలకు పెట్టిన ఆహారాన్ని తీసుకోవు. పదిహేను రోజులకోసారి ప్రత్యేక షాంపుతో తల స్నానం చేయించడం వల్ల ఆరోగ్యంగా ఉంటాయి. వీటిని సాకడానికి పిల్లుల సంఖ్యను బట్టి నెలకు రూ.8 వేలకు పైగా ఖర్చు ఉంటుంది.

పిల్లులతో రిలాక్స్ అవుతా



పిల్లులు ఎంతో రిలాక్స్‌ను ఇస్తాయి. ఇంటికి వెళ్లగానే నన్ను చూసి ప్రేమను వొలకబోస్తాయి. ఎదురుగా వచ్చి తోక ఊపుతూ వచ్చి నాపైకి ఎక్కడానికి పాకులాడుతాయి. రాత్రి బెడ్‌పై నా పక్కకు వచ్చి పడుకుని సేద తీరుతాయి. బెడ్‌పై ఎట్టి పరిస్థితుల్లో మల, మూత్ర విసర్జన చేయవు. ఆ మూగజీవాల ప్రేమను వర్ణించలేం.

– మహ్మద్ హాజీ, పెంపకందారు

పిల్లలతో సమానంగా చూసుకుంటాం



మా ఇంట్లో పిల్లులను చిన్నపిల్లలతో సమానంగా చూస్తాం. భార్య, పిల్లలు వాటిని అపురూపంగా చూసుకుంటున్నారు. రోజు ప్రత్యేక ఫుడ్, తాగునీరు అందిస్తారు. నేను డ్యూటీకి వెళ్లాక పిల్లుల సంరక్షణ బాధ్యతలు చూస్తాను. నా పట్ల పిల్లులు చూపించే ప్రేమను ఎప్పటికి మరిచిపోను. మా ఇంటికి వచ్చే ప్రతి ఒక్కరూ పిల్లులను చూసి ముచ్చట పడుతుంటారు.

– సలీం అహ్మద్‌ఖాన్, పెంపకందారు

అ'పూర్వ' సమ్మేళనం

రామకృష్ణాపూర్: శ్రీరాంపూర్‌లోని సాందీపని పాఠశాలకు చెందిన 2006–07 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారిఖిల్లాలో నిర్వహించిన ఈ సమ్మేళనంలో పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులంతా కలుసుకుని యోగ క్షేమాలు పంచుకున్నారు. స్కూళ్లో జరిగిన చిన్ననాటి సంగతులు, అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉదయం నుంచి సాయంకాలం వరకు ఉత్సాహంగా గడిపారు.



'గృహజ్యోతి' ప్రారంభం

తాండూర్/భీమారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకం ఆదివారం తాండూర్, భీమారం మండలాల్లో విద్యుత్ శాఖ అధికారులు ప్రారంభించారు. అర్హులైన వినియోగదారులకు జీరో బిల్లు అందజేశారు.